## టాంకర్‌ను డీకున్న బైక్ : ఇద్దరు మృతి



పెళ్ళకూరు నవంబర్ 3 ప్రభాతవార్త : నాయుడుపేట పూతలపట్టు జాతీయ రహదారిపై గుర్రపు తోట దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు మృతి చెందారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు శ్రీకాళహస్తిలోని తెట్టుకు సంబంధించిన ఉలస సుబ్ర హ్మణ్యం(35) ఉలస రూపేష్(10)లు సోమవారం నాడు నాయుడుపేటలోని విన్నమాలలో ఉన్న తమ బంధువులు ఇంటికి వెళుతూ మండలంలోని గుర్రపు తోట దగ్గర శ్రీకాళహస్తి నుండి నాయుడుపేట వైపు వెళుతున్న ట్యాంకర్ ను రాంగ్ రూట్లో వచ్చి ఢీకొనడంతో వలస సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందగా కుమారుడు రూపేష్ ను 1033 అంబులెన్స్ లో నాయుడుపేట లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ అత్యవసర విభాగానికి సంబంధించిన పరికరాలు లేవని చెప్ప డంతో అదే అంబులెన్స్ లో శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ బాలుడు రూపేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటన స్థలానికి నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు పెళ్లకూరు ఎస్సై నాగరాజు చేరుకుని సంఘటన జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## తుడ పరిధిలో అభివృద్ధిపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి సమాలోచనలు



తిరుపతి కార్పొరేషన్,నవంబర్3ప్రభాతవార్త: తుడ పరిధి విస్తరించడం, ఈ మధ్యకాలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం,శెట్టిపల్లి భూముల రైతులకున్యాయం చేయడం వంటివాటిపై తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి దృష్టి పెట్టడం అభినంద నీయమని రాష్ట్రమంత్రి మండిపల్లిరాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం నలందనగర్‌లోని తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి ఇంటికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పుంగ నూరు ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి(చల్లాబాబు)మర్యాదపూర్వకంగా విచ్చేశారు. వారిని స్వాగతించిన దివాకర్‌రెడ్డి కొంతసమయం అభివృద్ధిపనులు, పార్టీలో కార్యక్రమాలపై సమాలో చలనతో చర్చించారు. స్థానికంగా అభివృద్ధి పనులు, రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం అతిధులను సగౌవరవంగా దుశ్శాలువలతో సన్మానించారు.

# స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్రకు సిఎం చంద్రబాబు రథసారథి

**- స్వచ్ఛబడులకు శ్రీకారం..దేశంలోనే ఏపి రోల్ మోడల్ !! - స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం**



కుప్పం, నవంబర్ 3 ప్రభాతవార్త స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ఉద్యమానికి సిఎం చంద్రబాబు నాయుడు రథసారథిగా నిలుస్తున్నారని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్‌ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం పేర్కొన్నారు.సోమవారం సాయంత్రం కడ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వ విప్,కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కమీషనర్ శ్రీనివాసరావులతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. స్వచ్ఛత విషయంలో దేశానికి ఎపి రోల్ మోడల్‌గా నిలుస్తోందన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛసేవక్ దళ్‌లు ఏర్పాటుచేస్తామన్నారు. ఇందుకు కుప్పం నుంచే శ్రీకారం చుడతామన్నారు. అలాగే స్వచ్ఛరథం ద్వారా ప్రజల ఇళ్లనుంచి వ్యర్థాలుసేకరించి వాటి విలువకు తగిన విధంగా నిత్యావసర సరుకులు అందిస్తామన్నారు. విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహనపెంచేందుకు స్వచ్ఛబడులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వం రాష్ట్రంలో 85లక్షల టన్నులచెత్తను వదిలేయడంతో పాటు ప్రజలపై చెత్త పన్ను వేసిన చెత్త ప్రభుత్వం అని విమర్శించారు. దేశంలో సర్క్యులర్ ఎకానమీలో ఎపి మొదటి స్థానంలో ఉందన్నారు. కుప్పం నియోజకవర్గంలో సైతం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. ఇప్పటికే ఇ - రాయిస్ సంస్థ అందించిన 130 ఇ -ఆటోల ద్వారా ఇంటింటినుంచి చెత్తసేకరణచేస్తున్నట్లు తెలిపారు. జనవరిలో మొబైల్ ట్రీట్‌మెంట్ యూనిట్‌నుకుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారన్నారు. కుప్పంలో చెత్త సేకరణకు గాను ఇదివరకే ఓ కాంప్యాక్టర్ ఇచ్చామని త్వరలో మరో రెండు అందిస్తామన్నారు. మహిళల కోసం పింక్ టాయిలెట్లు నిర్మిస్తామన్నారు. సమావేశంలో కడ సభ్యులు రాజ్‌కుమార్,సుగుణమ్మ, కౌన్సిలర్లుజిమ్‌దాము,జాకీర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్ పాల్గొన్నారు.

### వెంకటాద్రినిలయంలో
# పబ్లిక్ అడ్రసింగ్ విధానం

**ఘాట్‌లో అక్కగార్లగుడివద్ద వర్షపునీరు మళ్ళించాలి -అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**



తిరుమల,నవంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి: వెంకటాద్రినిలయంలో వసతి సదుపాయం, అన్నప్రసాద వివరాలు, కల్యాణకట్ట, లాకర్ల సౌకర్యం మొత్తం సమన్వయంచేసి పబ్లిక్ అడ్రసింగ్ విధానం ద్వారా తెలియజేయాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. మొదటిఘాట్‌లో అక్కగార్లగుడివద్ద కొండల్లోంచి జారిపడుతున్న వర్షపునీటిని రోడ్డుపైకి రాకుండా దారిమళ్ళించేలా కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. వెంకటాద్రినిలయంలోపలకు పాద రక్షలతో రాకూడదని, లోపల పరిశుభ్రత పాటిం చాలని యాత్రికులకు నిరంతరం ప్రకటనచే యాల న్నారు. తిరుమలలో యాత్రికుల భద్రతకు తగినంత సిబ్బందిని నియమించి సిసికెమెరాలను అన్ని కీలక ప్రాంతాల్లో అమర్చాలని ఆయన సూచించారు. సోమవారం సాయంత్రం తిరుమల పద్మావతి విశ్రాంతి గృహంలోని సమావేశం మందిరంలో ఆయన అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. పిఎసి 5 వెంకటాద్రినిలయంలో వేడినీటిసరఫరాకోసం సోలార్‌ప్యానెల్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తూ, సౌకర్యాలను వెంటనే ఏర్పాటుచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాదరక్షల భద్రతకు స్టైయిన్‌లెస్‌స్టీల్ ర్యాక్‌లు అమర్చాలన్నారు. ఘాట్‌రోడ్లపై భద్రత నిబంధనలు అమలు చేయాలని, సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఐటిసిఎల్ వ్యర్థాలప్లాంట్ కార్యకలాపాలు ప్రారంబించిన విషయం అధికారులతో చర్చించారు.

## క్రికెట్ చరిత్రలో మహిళలు చరిత్ర సృష్టించారు

**- జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



చిత్తూరురూరల్, నవంబరు 3 ప్రభాతవార్త: మహిళా క్రికెట్ చరిత్రలో భారత మహిళా జట్టు చరిత్ర సృష్టించిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసా ద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జరిగిన మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ పోటీలో భారత మహిళా జట్టు విజయం సాధించి ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం చిత్తూరు విజయం డిగ్రీ కళాశాల వద్ద కళాశాల విద్యార్థులతో కలసి కేక్ కట్ చేసి విజయోత్సవాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మహిళలు తలచుకొంటే సాధించలేనిది ఏదీ లేదని, 40ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భారత మహిళల జట్టు ప్రపంచకప్ గెలవడం మహిళా లోకానికి ఎంతో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అలాగే ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ భారత మహిళా జట్టు చరిత్రను తిరగరాసి ప్రపంచ కప్ గెలవడంతో ఎంతో మంది మహిళు, బాలికలు క్రీడల వైపు ఆసక్తి పెంచేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కళాశాల కరస్పాండెంట్ డా. తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు అండగా మహిళా కమీషన్

**- మహిళల రక్షణకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు**
**- రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రొకేయా బేగం**



చిత్తూరు, నవంబర్ 3 ప్రభాతవార్త: రాష్ట్రంలోని మహిళలకు మహిళా కమీషన్ అండగా నిలుస్తోందని రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రొకేయా బేగం అన్నారు. చిత్తూరు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన దారుణ ఘటనపై రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రొకేయా బేగం కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన దారుణ ఘటన విషయంను మహిళా కమీషన్ తీవ్రంగా పరిగనిస్తోందన్నారు. విద్యార్థుల శ్రేయస్సు ప్రతి విద్యాసంస్థలో నిర్ధారించబడేలా భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూసేందుకు కృషి చేస్తామన్నారు. సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన దారుణ ఘటనలో కళాశాలకు చెందిన బిటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థిని నందినిరెడ్డి ల్యాబ్ పరీక్షకు రికార్డులు సబ్‌మిట్ చేయలేదని దీనిపై ప్రశ్నించడంతో నందినిరెడ్డి తాను తన కుటుంబసభ్యులతో కలిసి చెన్నై వెళ్ళి వచ్చానని చెప్పడంలో ల్యాబ్ పరీక్షకు అనుమతించకపోవడంతో ఆత్మాహత్యాయత్నంకు పాల్పడిందన్నారు. ఈ ఘటనపై తాను విచారణకు రావడం జరిగిందన్నారు. ఈ ఘటన తీవ్రత దృష్టిలో వుంచుకుని ఘటనకు దారితీసిన వాస్తవిక పరిస్థితులను పరిశీలించడంతో పాటు, కళాశాల నిర్వహణ, అధ్యాపకులు, సంబంధిత సిబ్బందితో మాట్లాడి విద్యార్థినిపై వారి ప్రవర్తన, వ్యవహార తీరును ఘటనకు దారి తీసిన పరిస్థితులను పరిశీలించి నివేదికను కమీషన్ దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుందన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరీ, చిత్తూరు తాలుకా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డికె బద్రీనారాయణ, జైలు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉచ్చులో పడి ఇద్దరు మృతి



బంగారుపాళ్యం, నవంబర్ 3 ప్రభాతవార్త: అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన ఉచ్చులో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని బండ్లదొడ్డి గ్రామ సమీప మామిడి తోటలో సోమవారం తెల్లవారుజాము చోటు చేసుకుంది. గ్రామానికి సమీపంలోని మామిడితోటకు అతి దగ్గరలో అటవీ ప్రాంతం వున్నది. ఈ అటవీ ప్రాంతంలో అడవి పందులు, దుప్పులు, ఇతర జంతువులు సంచరిస్తుంటాయి. అడవి పందుల మాంసం కోసం రైతులు విద్యుత్ తీగలను మామిడి తోటలో ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన అయ్యప్ప, కుట్టిలు ఈ విద్యుత్ తీగలను గుర్తించక మామిడి తోపు గుండా అడవి వైపుకు పయనించారు. ఈ విద్యుత్ తీగలను వారు గుర్తించలేకపోవడంతో విద్యుత్‌షాక్‌కు లోనై మామిడి తోటలోనే మృతి చెందారు. వీరితో పాటు ఓ అడవి పంది సైతం విద్యుత్‌షాక్‌కు గురై వారికి సమీపంలోనే మృత్యువాత పడింది. సోమవారం పశువుల కాపర్లు మృతి చెందిన అయ్యప్ప, కుట్టిల మృతదేహాలను గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అటవీశాఖ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్స్‌పెక్టర్ కత్తిశ్రీనివాసులు, ఎఎస్‌ఐ మల్లప్ప ఇతర సిబ్బంది, అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన అయ్యప్ప, కుట్టిలను పరిశీలించి అనంతరం శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్వీయూలో విద్యార్థినులపై ప్రొఫెసర్ వేధింపులు

**జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తున్న సీనియర్ విద్యార్థులు. విద్యార్థి సంఘాల ఆందోళన**



తిరుపతి విద్య, నవంబర్ 3 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థినులపై ప్రొఫెసర్ వేధింపుల ఘటన కల కలం రేపింది. సైకాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డి విద్యార్థినుల్ని వేధిస్తున్నారని, సీనియర్ విద్యార్థులతో ర్యాగింగ్ చేయిస్తున్నట్లు నలుగురు విద్యార్థినులు రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని గుట్టుచప్పుడు కాకుండా పరిష్కరించేందుకు మహిళా హాస్టల్ వార్డెన్లను పిలిపించి రాజీ ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరగడంతో విద్యార్థి సంఘాల నేతలు రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని ఆందోళనకు దిగారు. రెక్టార్ అప్పారావు బాధిత విద్యార్థినుల్ని తన ఛాంబర్కు పిలిపించి ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డితో రాజీ చేయించేందుకు ప్రయత్నించారన్న సమాచారంపై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెక్టార్ ఛాంబర్ తలుపులు పగులగొట్టి లోపలికి దూసు కెళ్లారు. అనంతరం రిజిస్ట్రార్, రెక్టార్లు విద్యార్థి సంఘాల నేతలతో సమావేశమై చర్చించారు. సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేస్తూ తక్షణ చర్యలు చేపట్టారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య నరసింగరావు ఢిల్లీలో ఉన్నందున రిజిస్ట్రార్ ఆయనతో ఫోన్లో మాట్లాడారు. ప్రొఫెసర్పై విచారణ కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై ఎస్పీకి సైతం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వీసీ బుధవారం తిరిగి వచ్చిన తర్వాత కమిటీ ఏర్పాటు చేసి ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డిని సస్పెండ్ చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థి సంఘాలు ఆందోళనను విరమించాయి. ఈ ఆందోళన సమయంలో పోలీసులతో జరిగిన తోపులాటలో పలువురు విద్యార్థి నేతలు గాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎ ఎస్ యూఐ, జీఎన్ఎస్, జేబీఎస్ఎఫ్ నాయకులు రవి, అక్బర్, అశోక్, వినోద్, చలపతి, జెన్నె మల్లికార్జున, శివశంకర్ నాయక్, తిరుమలేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి ఉద్యోగులకు తిరుపతిలో డిస్పెన్సరీ

**-ప్రారంభించిన రాష్ట్రమంత్రి మండిపల్లి**



తిరుపతి రవాణ,నవంబర్3ప్రభాతవార్త: రాష్ట్రంలో రోడ్డుప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్రరవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లాలో అలిపిరి డిపో ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసి డిస్పెన్సరీని రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసి ఎండి ద్వారకతిరుమలరావు, పచ్చదనం సుందరీకరణ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఆర్టీసి జోనల్ ఛైర్మన్ కొనకళ్ల సత్యనారాయణతో కలసి సోమవారం డిస్పెన్సరీని ప్రారంభించారు. ఆర్టీసి ఉద్యోగుల కోసం తిరుపతిలో 1.92కోట్ల రూపాయలతో అలిపిరి డిపో సమీపంలో 0.12ఎకరాల విస్తీర్ణంలో డిస్పెన్సరీ,విశ్రాంతి గదులు ఏర్పాటుచేశామ న్నారు. వృద్ధులు, రోగుల సౌకర్యార్థం మందులదుకాణం, ల్యాబ్, ఓపి ,వైద్యుల గదులుప్రత్యేకంగా లిఫ్ట్ సౌకర్యం కల్పిం చారన్నారు. తిరుపతి జిల్లాలోని 11 డిపోలు కలిపి ఉమ్మడిచిత్తూరుజిల్లాలోని 6వేల ఆర్టీసి కుటుంబాలు లబ్ధిపొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి జోనల్ ఇడిలు సురేశ్‌రెడ్డి, చంద్రశేఖర్, రవివర్మ, చెంగల్‌రెడ్డి, తిరుపతి జిల్లా రవాణాఅధికారి విశ్వనాధ్,అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 403 అర్జీలు



తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 3 ప్రభాతవార్త : జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)లో జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ట్రైన్ కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ తో పాటు డి ఆర్ ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, శివ శంకర్‌నాయక్,రోజ్ మాండ్, సుధా రాణి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు.

## సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్



చిత్తూరుహెల్త్, నవంబర్ 3 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్, డిఆర్ఓ మోహన్‌కుమార్, డిప్యుటీ కలెక్టర్లు విజయలక్ష్మీ, కుసుమకుమారిలు,చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

## కార్తీకమాసం శివయ్యకు ప్రీతిపాత్రం

**దీపాలతో దేదీప్యమానం**





శ్రీకాళహస్తి, నవంబర్ 3 ప్రభాతవార్త కార్తీకమాసం శివయ్యకు ఎంతో ప్రీతిపాత్రమని, ఈమాసంలో మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో శివయ్యను, అమ్మవారిని ఆరాధిస్తూ దీపాలు వెలిగించి తమ మొక్కులుతీర్చుకుంటారని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి అన్నారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా రెండో సోమవారం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం ఏర్పాటు చేసిన దీపాల మండపంలో రాత్రి దీపాలను వెలిగించుటకు ఇసుకేస్తె రాలనంత రద్దీ ఏర్పడింది. అయితే శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచనలతో కార్తీక సోమవారం మహిళలు దీపాలు వెలిగించటానికి ఎలాంటి అభ్యంతరం చేయవద్దని సూచించారు. దాంతో ఆలయాధికారులు ఏర్పాట్లు చేసారు.ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసారు. ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టు సాయి ప్రసాద్,ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ముఖ్యంగా మొదటి గేటు బిక్షాల గాలిగోపురం నుంచి అడుగువేయటానికి కూడా స్థలం లేకుండా మారింది. సోమవారం భక్తులు తండోపతండాలుగా వచ్చారు. ఓ వైపు దీపాలు వెలిగించుట మరో వైపు స్వామి అమ్మవార్ల దర్శనాలకు విపరీతమైన రద్దీ చోటు చేసుకుంది. ఏర్పాట్లును ఇఓ డి.బాపిరెడ్డి పర్యవేక్షణలో ఆలయాధికారులు డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణం యాదవ్,సూపరింటెండెంట్ శ్రీహరిలు పర్యవేక్షించారు.ఎపిఆర్ఓ రవిలు పర్యవేక్షించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రదోష నందిసేవలో ఆమె పాల్గొన్నారు. చిన్నవెండి నందివాహనంపై స్వామివారిని ప్రతిష్టించి ఆల యంలో ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇఓ సూపరింటెండెంట్‌లు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం



శ్రీకాళహస్తి,నవంబర్ 3 ప్రభాతవార్త కార్తీక సోమవారం సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ధార్మిక,ఆధ్యాత్మిక చింతన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో పోలో మని మహిళలు దీపాలను వెలిగించారు. రంగుల గోపురం లోపల అలాగే మణికంఠేశ్వరాల యం వద్ద చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన మహిళలు దీపాలు వెలిగించారు.రాత్రి స్వామి అమ్మవార్లను కేరళ పంచవాయిద్యాదలతో సంప్రదాయ వాయిద్యాల మోతతో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంతో పాటు ఉభయదారులు పిఎంవి నారాయణ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి కుటుంబసభ్యులు ఉభయంతో హాజరయ్యారు. ఆలయ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.ఉత్సవం నాలుగుమాడావీదుల్లో సాగింది.

### వైష్ణవ కోనేరులో దీపోత్సవం



శ్రీకాళహస్తి,నవంబర్ 3 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా రెండవ సోమ వారం ఆలయం తరఫున పట్టణ నడి బొడ్డులోని జయరామారావు వీధిలోని వైష్ణవ కోనేరులో 'దీపోత్సవం' ఏర్పాటు చేసారు. సోమవారం రాత్రి ఇక్కడ దీపోత్సవం సందర్భంగా చక్కగా పూలతో ముస్తాబు చేసారు. ఇక్కడ స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కోనేరు చుట్టు నెయ్యి దీపాలను వెలిగించారు. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి ఈ కార్యక్రమాల్లో ఇఓ డి.బాపిరెడ్డి దంపతులు డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఆలయ ఛైర్మెన్ కొట్ట సాయి ప్రసాద్ సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి గోపినాధ్,రాఘవయ్య హాజరయ్యారు. జయరామారావు వీధికి చెందిన రమణమూర్తి(స్వామి) పాల్గొన్నారు.

# చెత్తకుండీ లేని రాష్ట్రం ఏర్పాటు దిశగా చర్యలు

## రాష్ట్ర స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్

చిత్తూరు, నవంబర్ 3 ప్రభాతవార్త:




చెత్తకుండీ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుని పని చేస్తోందని రాష్ట్ర స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ అన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఏపి స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ జిల్లాలో చేపట్టిన పారిశుధ్య నిర్వహణ, వేస్ట్ మేనేజ్‌మెంట్‌లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏపి స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లకు 50 ఎలక్ట్రిక్ వాహనాలు అందించి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరించడానికి త్రోపుడు బండ్లు అందించడం జరిగిందని, అవసరం మేరకు పట్టణ ప్రాంతాల్లో సైతం త్రోపుడు బండ్లను అందించడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ రథం పేరుతో గృహాల్లోని చెత్త నుండి వేరు చేసిన పొడి చెత్తను ప్రభుత్వం సేకరిస్తుందని, అందుకు తగిన విధంగా నిత్యవసర వస్తువులు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంను 100 మండలాల్లో చేపట్టడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. అలాగే నమస్కే స్కీమ్ కింద ఒక యాప్‌ను క్రియేట్ చేసి ఇంటి వద్ద చెత్త సేకరించి స్క్రాప్ డీలర్లు, వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నియమ నిబంధనల మేరకు రీ-సైక్లింగ్ యూనిట్లకు అందించడం జరుగుతుందని, దీనికి తగిన ధర చెల్లించడం జరుగుతుందన్నారు.సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటేష్, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి నిస్వార్థంగా కృషి చేయండి

## - ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



చిత్తూరురూరల్, నవంబరు 3ప్రభాతవార్త: సంస్కృతి, సాంప్రదాలయాలను పరిరక్షిస్తూ ఆలయాల అభివృద్ధికి నిస్వార్థంగా కృషి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని, కూటమి ప్రభుత్వం ఆద్వర్యంలో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారనీ, కమిటీ సభ్యులు ఆలయాల పవిత్రను కాపాడేలా పనిచేయాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ ఛైర్మెన్‌గా ఎన్ చంద్రశేఖర్, సభ్యులుగా లావణ్య, శివకుమార్, శ్యామల, బిజి మురుగేష్, మాధవి, సురేష్, రాజేష్, ఇన్నవల్లిల చేత ప్రమాణ స్వీకారం చేసారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, జనసేన నాయకులు కవిత, తెదేపా నాయకులు వెంకటేష్‌యాదవ్, పచ్చప్ప, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు మేనేజర్ వ్యవహారం పట్ల ఖాతాదారుల ధర్నా

కల్లూరు, నవంబర్ 3, ప్రభాతవార్త



కావేటిగారిపల్లి పంచాయతీ, కొమ్మిరెడ్డి గారిపల్లెలోని గ్రామీణ బ్యాంకు మేనేజరు వ్యవహారం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ గ్రామస్తులు, రైతులు, మహిళలు, డ్వాక్రా సంఘ సభ్యులు సోమవారం బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు. బ్యాంకుకు వచ్చే కస్టమర్లతో, ముఖ్యంగా రైతులు, మహిళలతో మర్యాద లేకుండా మాట్లాడుతున్నారని, కావాల్సిన సేవలు సమయానికి అందించడం లేదని వారు ఆరోపించారు. క్రాప్ లోన్ చెల్లించిన తర్వాత కూడా కొత్త లోన్ మంజూరుకు నెలల తరబడి తిప్పలు పెడుతూ, ఐదుగురు షూరిటీలు తీసుకురమ్మని అనవసర ఒత్తిడి తెస్తున్నారని రైతులు తెలిపారు. బ్యాంకు మేనేజర్ ప్రవర్తనతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వెంటనే ఆయన్ని ఇక్కడి నుంచీ బదిలీ చేయాలని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు డిమాండ్ చేశారు. అప్పుడు వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు తెలిపారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో ధర్నాను విరమించారు.

# నేటి నుండి కార్తీక మాస పూజలు

పాకాల, నవంబర్ 3, ప్రభాతవార్త

పాకాల మండలంలోని ఉప్పరపల్లి గ్రామపంచాయతీ సూరినేని వారి పల్లె గ్రామంలో వెలసియున్న గుర్రప్ప స్వామి శివాలయం నందు నేటి నుండి రెండు రోజులపాటు కార్తీక మాస పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సూరినేని బుజ్జిబాబు నాయుడు తెలిపారు. మంగళవారం గణపతి పూజ, గోపూజ, కలశ స్థాపన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, లలితా పరమేశ్వరిదేవి లక్ష కుంకుమార్చన, అన్నాభిషేకం, జ్యోతిర్లింగ సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలియజేశారు.

# రాష్ట్ర స్థాయి పోటీలు రొంపిచెర్ల విద్యార్థి ఎంపిక

రొంపిచెర్ల, నవంబర్ 3, ప్రభాతవార్త:



రాజ్యాంగ దినోత్సవంను పురస్కరించుకొని అమరావతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు రొంపిచెర్ల మండల విద్యార్థి ఎంపిక అయినట్లు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నిఖిల్ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పలు పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఆవరణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగే పోటీలలో పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నిఖిల్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

# ముగ్గురు కోడి పందె రాయుళ్ల అరెస్టు

రొంపిచెర్ల, నవంబర్ 3, ప్రభాతవార్త:

కోడిపందేలు ఆడుతున్న ముగ్గురు కోడి రాయుళ్ల ను అదుపులోకి తీసుకొని రూ.2100 నగదు, 2 కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రొంపిచెర్ల మండలంలోని బొమ్మయ్యగారిపల్లి గ్రామపంచాయతీ, స్టోన్ క్రషర్ వద్ద ఉన్న మామిడి తోటలో కోడిపందాలు ఆడుతున్నారని అందిన రహస్య సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారి దగ్గర నుండి రూ.2100 నగదును, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ సుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశు వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

సదుం, నవంబర్ 3 ప్రభాతవార్త



పశు వైద్యాధికారులు సమయపాలన పాటించాలని ప్రాంతీయ పశు వైద్య అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు నాయుడు అన్నారు. సోమవారం సదుంలో ప్రాంతీయ పశు వైద్యాధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సోమల సదుం, పులిచెర్ల, రొంపిచర్ల అన్ని పశు వైద్యశాలలో పేయ దూడల ఎద టీకా అందుబాటులో ఉన్నాయని కేవలం 150 రూపాయలు చెల్లించి సబ్సిడీ ధరతో పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పశువైద్యాధికారులు మరియు సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సదుం పశువైద్యాధికారి డాక్టర్ ప్రదీప్, కందూరు పశువైద్యాధికారి డాక్టర్ చందన ప్రియ, పులిచెర్ల పశువైద్యాధికారి డాక్టర్ దబ్రీజ్ భాష,కొత్తపేట పశువైద్యాధికారి డాక్టర్ శ్రీహరి,రొంపిచర్ల వైద్యాధికారి డాక్టర్ ఉషా మరియు నాలుగు మండలాల పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల క్రికెట్ జట్టుకు అభినందనలు

సదుం నవంబర్ 3 ప్రభాతవార్త ప్రపంచ క్రికెట్ కప్పును గెలిచిన భారత మహిళల జట్టుకు సోమవారం చదుము లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఉదయం పాఠశాలలో ప్రార్థన సమయంలో ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతూ పలు ఉపాధ్యాయులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టిటిడి కళ్యాణ మండపంలో గోల్మాల్

పుంగనూరు, నవంబర్ 3 ప్రభాతవార్త

పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో అధిక ధరలు వసూలు చేస్తూ కాంట్రాక్టర్ గోల్మాల్ కు పాల్పడుతున్నాడని ఎస్సీ ఎస్టీ సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు సోమవారం ఉదయం రాష్ట్ర దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర ఆధ్వర్యంలో టిటిడి కళ్యాణ మండపం ఎదురుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. పేద బడుగు వర్గాల వారు వివాహాలు వేడుకలు తక్కువ ఖర్చులలో నిర్వహించుకునేందుకు దేవస్థానం వారు ప్రతి మండలంలోనూ టిటిడి కళ్యాణ మండపం ఏర్పాటు చేశారని, అయితే పుంగనూరులో టిటిడి నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై కాంట్రాక్టర్ రవికుమార్ రెడ్డిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు వెంటనే కాంట్రాక్టర్లు తొలగించి వేరొకరికి ఈ కాంట్రాక్టు అప్పగించి సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారి కొరకు. ఈ మేరకు తాసిల్దార్ కు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు

# ఉపాధ్యాయుడు మృతి

పుంగనూరు నవంబర్ 3 ప్రభాతవార్త



పట్టణంలో నివసిస్తున్న అబ్దుల్ లతీఫ్ (48) అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది.

# పసుపులేటివారిపల్లె సమస్యల పరిష్కారంపై దృష్టి

పూతలపట్టు, నవంబర్ 3, ప్రభాతవార్త



పూతలపట్టు మండల ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వర పరిష్కరించడ పై విఆర్ఓ కు దృష్టి పెట్టాలని తాసిల్దార్ రమేష్ బాబు ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు పరిష్కారం ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఇరువర్గాల సమస్య విని క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రతిష్టాత్మంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి దీనికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నిర్దేశించిన కాల పరిమితిలో సమస్యలపై ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించి పక్కాగా న్యాయం చేయాలని తెలిపారు.

# ప్రజా సమస్యల్ని త్వరగా పరిష్కరించాలి : కడ పి.డి.

కుప్పం,నవంబర్ 3 ప్రభాతవార్త



ప్రజల సమస్యల్ని అధికారులు త్వరగా పరిష్కరించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని కడ పి.డి. నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి వివిధ సమస్యలపై పదమూడు వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట కాల వ్యవధిలో ప్రజా సమస్యలుపరిష్కరించాలని అలా కుదరని పక్షంలో అందుకు గల కారణాలు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఆయా శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు చిట్టిబాబు, శివయ్య, డిఇలు గురవారెడ్డి,పురుషోత్తం, ఎడి రెడ్డికుమారి, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, రెస్కో ఎడి ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఛైర్మన్‌చే డంపింగ్ యార్డ్ స్థలం పరిశీలన

కుప్పం, నవంబర్ 3 ప్రభాతవార్త



కుప్పం పట్టణ సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డ్ స్థలాన్ని సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరా ం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్‌తో కలసి పరిశీలించారు. ఈ కమీషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమారు 14 టన్నుల వ్యర్థాలను డంపింగ్‌యార్డ్ నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో చేపట్టే ప్లాంటేషన్‌పై ఛైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ సభ్యులు రాజ్‌కుమార్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కన్నన్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గస్థాయిలో విద్యార్థులకు పోటీలు

కుప్పం, నవంబర్ 3 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం కుప్పం నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవంను పురస్కరించుకుని వ్యాసరచన, వక్తృత్వ,క్విజ్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో నేత్రావతి, శృతి, లోకేష్ విజేతలుగా నిలిచారు. ఈసందర్భంగా వీరికి ఎంఇఒ 2 రాజారాం, గుడుపల్లె ఎంఇఒ 2 లక్ష్మయ్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కమిటీలు పార్టీ బలోపేతంకు పనిచేయాలి

కుప్పం, నవంబర్ 3 ప్రభాతవార్త



వైకాపా నూతన వార్డు కమిటీలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైకాపా మున్సిపల్ అధ్యక్షుడు హఫీజ్ కోరారు. సోమవారం ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలతో స్థానిక 13వ వార్డు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షుడిగా జయగోపి, ఉపాధ్యక్షుడిగా రమేష్, సురేష్, యూత్ అధ్యక్షులుగా శంకర్, సోషియల్ మీడియా అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ ఉపాధ్యక్షుడు మునిరాజు, కౌన్సిలర్లు మోహన్‌రాం, మణి, రాజ్‌కుమార్, నాగరాజు, జయశంకర్‌లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతులు అందజేత

రామకుప్పం,నవంబర్ 3 ప్రభాతవార్త



మండలంలోని విజలాపురం హైస్కూల్‌లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ఎస్ఎంసి ఛైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరరావు, శివకుమార్, హరీష్, వివేక్ పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌పై తక్షణమే స్పందించాలి : పార్వతి

చౌడేపల్లి, నవంబర్ 3 ప్రభాతవార్త

ప్రజాసమస్యల పరిష్కార వేదికల్లో వచ్చిన సమస్యలపై తక్షణమే స్పందించాలని తహశీల్దార్ పార్వతి అన్నారు. స్థానిక కార్యాలయంలో మండలంలోని విఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం జరిగింది. గ్రామీణ ప్రాంతాల నుంచి అధికంగా వస్తున్న భూసమస్యల పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. రైతులకు అందుబాటులో వుండి సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రం నుంచి ఉన్నతాధికారుల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం మండలంలోని రెవిన్యూ సమస్యలపై చర్చించారు. విఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో కేదారీ నోములు

చౌడేపల్లి, నవంబర్ 3 ప్రభాతవార్త



కార్తీక సోమవారం సందర్భంగా మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో కేదారీ నోములను నోచుకొన్నారు. మండల కేంద్రమైన చౌడేపల్లి లోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ఉదయాన్నే అర్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకము, అలంకరణ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సమక్షంలో అర్చకులు కేదారీ నోముల వ్రతాన్ని చేయించారు. వ్రత మహిమలను భక్తులకు వినిపించారు. మహిళలచే కార్తీక దీపారాధన కన్నుల పండుగలా జరిగింది.

# సర్వేయర్ల సంఘ డివిజనల్ ఉపాధ్యక్షుడుగా మురళీకృష్ణ

చౌడేపల్లి, నవంబర్ 3 ప్రభాతవార్త



ఎపిఎస్ఈఎ డివిజనల్ ఉపాధ్యక్షుడుగా చౌడేపల్లికి చెందిన సర్వేయర్ మురళీకృష్ణ ఏకగ్రావంగా ఎన్నికయ్యారు. డివిజన్‌లోని 13మండలాలకు సంబంధించిన ప్రభుత్వ సర్వేయర్ల సమావేశం జరిగింది. ఇందులో భాగంగా సంఘ ఉపాధ్యక్షుడి ఎన్నికను ఏకగ్రావం చేసారు. సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి కట్టుబడి వుంటానని ఈ సంధర్భంగా మురళీకృష్ణ అన్నారు. మండల సర్వేయర్లు ఆయన్ను దుశ్శాలవాలతో సన్మానించారు.

# ఆర్టీసి డ్రైవర్ రామయ్య అద్భుత జ్ఞాపిక

తిరుపతిరవాణ,నవంబర్3ప్రభాతవార్త:



తిరుపతిలో ఆర్టీసి డిస్పెన్సరీనిప్రారంభించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎండి ద్వారకతిరుమలరావు, ఛైర్మన్ సత్యనారాయణరావుల ఫోటోలను ఆర్టీసి డ్రైవర్ రామయ్య కుమార్తె పూజిత తన చేతులతో గీసిన జ్ఞాపికలను బహుకరించారు. డ్రైవర్‌ను ప్రముఖులు అభినందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

# అభివృద్ధి..సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లాలి

## - ప్రభుత్వ విప్ డా॥ కంచర్లశ్రీకాంత్

కుప్పం,నవంబర్ 3ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజల్లో తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. సోమవారం మండలంలోని జరుగు, గుడ్లనాయనపల్లి గ్రామాల్లో జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కుప్పం ప్రాంత రైతుల కోసం కృష్ణాజలాలను సిఎం తీసుకువచ్చారన్నారు. అలాగే ఎన్నికల హామీ అయిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వీటికి తోడు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలుచేపట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, రైతులకు గోకులంషెడ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. ప్రతినెల పంచాయతీ సమావేశాలు జరపాలన్నారు.కార్యకర్తలకు తాము అండగా ఉంటామన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, మాజీ ఎంపిపి సాంబశివ ం, కడ సభ్యుడు రామచంద్ర, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, నేతలు మురళి,సుబ్బు, మహేంద్ర, సంతోష్, వేడి, బాలాజీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కుప్పం రెస్కోలో ఉద్యోగాల పేరిట మోసపోవద్దు

## - రెస్కోఛైర్మన్ ప్రతాప్ కుమార్

కుప ్పం,నవంబర్ 3 ప్రభాతవార్త



కుప్పంగ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో)లో ఉద్యోగాలు తీసిస్తామని ఎవరైనా చెబితే నమ్మి ప్రజలు,యువత మోసపోరాదని రెస్కోఛైర్మన్ విజి ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక రెస్కో కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా పాలనలో రెస్కో లైసెన్స్ రెన్యువల్ కానున్నా విచ్చలవిడిగా నగదు తీసుకుని పద్ధతి లేకుండా ఉద్యోగాలు ఇచ్చేశారన్నారు. అలా ఉద్యోగాల్లో చేరిన వారిని తొలగించేందుకు గాను 51వ నిబంధనకు తాము ఆమోదించి సహకార శాఖ ఉన్నతాధికారులకు పంపామన్నారు. ప్రస్తుతం రెస్కోలో ఉద్యోగాలు కల్పించేస్థితి లేదన్నారు. ఈ నేపథ్యంలో పలమనేరు నియోజకవర్గంలో కొ ందరు కుప్పం రెస్కోలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ప్రజలనునమ్మించి వారి వద్దనుంచి 4-5లక్షలు వసూలుచేస్తున్నట్లు తమ దృష్ ్టికి వచ్చిందని పేర్కొంటూ ఇందుకు సంబంధించిన ఆడియో సంభాషణ వినిపించారు. ఈ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. తమకు రెస్కో ఛైర్మన్, డైరెక్టర్లు తెలుసని వాళ్ల ఫ్రెండ్స్ అంటూ అమాయకుల వద్ద నుంచి లక్షలు వసూలుచేస్తూ అక్రమాలకు తెరలేపారని ఇది మంచిది కాదన్నారు. పాలకవర్గానికి సంబంధం లేని వారు ఇలా చేస్తున్నారన్నారు. తాము రెస్కోలో ఎలాంటి ఉద్యోగాలు విక్రయించేది లేదని తమ సంస్థ ఉద్యోగాలు అమ్ముకునే స ంస్థ కాదని స్పష్టం చేశారు. సమావేశంలో రెస్కో డైరెక్టర్లు అనసూయ, ఆర్ముగం, అమీర్, తులసినాథ్, శివ తేవర్, శరణ్‌కుమార్, మునివెంకటప్ప, బాలగంగాధర్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు నియోజకవర్గ స్థాయిలో ముగ్గురు విద్యార్థులు ఎంపిక

గంగాధర నెల్లూరు నవంబరు 3 ప్రభాతవార్త:



భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి విద్యార్థిని విద్యార్థులకు వ్యాస రచన మరియు వకృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు జడ్జిలుగా మేనాటం పల్లి నోడల్ హెడ్మాస్టర్ కేశవ రెడ్డి గోవింద రెడ్డి రవి గంగాధరంలు వ్యవహరించారు. పర్యవేక్షలుగా స్థానిక ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య పాఠశాల ఉపాధ్యాయులు వ్యవహరించారు.ఈ పోటీలలో ఆరు మంది ఎంపిక చేసి ఈ ఆరు మందికి క్విజ్ పోటీలను నిర్వహించి వీరిలో ముగ్గురుని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపనున్నామని మండల విద్యాశాఖ అధికారి అంజనేయులు శెట్టి తెలిపారు.ఈ పోటీలలో కార్వేటి నగరం మండలం కత్తిరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పి శశిర మొదటి స్థానంలో అదే మండలానికి చెందిన డిఎం పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పి గోవర్ధన్ ద్వితీయ స్థానంలో గంగాధర నెల్లూరు మండలం కలేపల్లే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న టి లిఖత్ తురిచే స్థానంలో ఎంపికైనట్లు వీరిని రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు పంపనున్నట్లు వారు తెలిపారు.ఎంపికైన ముగ్గురువిద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుని ప్రమాణ స్వీకారం

శ్రీకాళహస్తి,నవంబర్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడుగా నియమించిన అనంతపురం జిల్లాపుట్టపర్తికి చెందిన లక్ష్మీనారాయణ కార్తీక మాసంరెండవ సోమవారం భక్తి శ్రద్ధలతో ప్రమాణ స్వీకారం చేసారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ప్రమాణ స్వీకారాన్ని ఏర్పాటు చేసారు. లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులతో రాగా ఆయనకు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ వారి సహాచర బోర్డు సభ్యులు స్వాగతం పలికారు. ఆలయాధికారులు ప్రమాణ స్వీకారాన్ని దక్షిణామూర్తి ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. దేవుని ఎదుట అంటూ లక్ష్మీనారాయణ ప్రమాణం చేసారు.ఆయన చేత ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ప్రముఖ సినీ నటుడు నారారోహిత్,తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరం రమేష్,బాలు డిల్లిబాబు,గుడ్లూరు మల్లికార్జున్‌నాయుడు వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఏర్పాట్లును ఎఇఓ మోహన్, విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి తదితరులు పర్యవేక్షించారు.

# బ్రహ్మోత్సవాలు, భారత రాష్ట్రపతి భద్రతపై సమీక్ష

## - తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు

తిరుచానూరు, నవంబర్ 3, ప్రభాతవార్త



రాష్ట్రపతి పర్యటనతో పాటు అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతతో అప్రమత్తంగా వ్యవహరించాలని తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బారాయుడు ఐపిఎస్ తన సిబ్బందికి సూచించారు. రానున్న తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు, అమ్మవారిని దర్శించునున్న భారత రాష్ట్రపతి పర్యటన సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ కాన్ఫరెన్స్ హాల్ నందు ఎస్పీ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం వున్నందున, ప్రతి విభాగం సమన్వయంతో క్షుణ్ణమైన ప్రణాళికతో పనిచేయాలి. భక్తుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి,అని సూచించారు. అలాగే రాష్ట్రపతి అమ్మవారి దర్శన పర్యటన సందర్భంగా అన్ని భద్రతా విభాగాలు పరస్పర సమన్వయంతో, అత్యధిక అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. ట్రాఫిక్, పార్కింగ్, షక్తి టీమ్ పర్యవేక్షణ మరియు మహిళా భక్తుల రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు.సమావేశంలో అదనపు ఎస్పీలు రవి మనోహరచారి, ఐ. రామకృష్ణ (తిరుమల), నాగభూషణరావు (క్రైమ్), శ్రీనివాసరావు (సాయుధ దళం), డియస్పీలు వెంకటనారాయణ (యస్.బి), భక్తవత్సలం (తిరుపతి), ప్రసాద్ (చంద్రగిరి), రామకృష్ణ ఆచారి (ట్రాఫిక్) తదితర అధికారులు పాల్గొన్నారు.

# వానమామలిజీయర్‌స్వామికి సాంప్రదాయ స్వాగతం

తిరుమల,నవంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీమద్ పరమహమ్‌సేథాయంతి మధురకవి వానమా మలి జీయర్‌స్వామికి టిటిడి సాంప్రదాయ స్వాగతం పలికింది. సోమవారం ఉదయం శిష్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# తిరుపతి డివిజన్

## జిల్లాలో వరకట్న నిషేధ చట్టంను పటిష్టంగా అమలు చేయాలి

-జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి వసంత భాయి



తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 3 ప్రభాతవార్త : జిల్లాలో వరకట్న నిషేధ చట్టం ను పటిష్టంగా అమలు చేయాలి అని మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి వసంత భాయి తెలిపారు.సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ ఆధర్వంలో వరకట్నం చట్ట నిష్నేధ అమలుపై జిల్లా స్థాయి అడ్వైజరీ బోర్డు సమావేశం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారినీ వసంత భాయి నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని మాట్లాడుతూ జిల్లాలో వరకట్నం నిషేధ చట్టం ను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ఎక్కడైనా వరకట్న వేధింపులకు గురైన మహిళలకు ఈ కమిటీ సభ్యులు వారికి న్యాయ, ఆర్థిక సహాయం అందించగలరని తెలిపారు. ఈ చట్టం ప్రకారం కట్నం తీసుకోవడం, ఇవ్వడం కూడా నేరమని తెలిపారు. వరకట్నం కు సంబంధించి వస్తువు కానీ ఆస్తినీ గాని అగ్రిమెంట్ వంటివి కూడా తీసుకొని ఎడల ఇది నేరముగా పరిగణించబడుతుందని అన్నారు. మహిళలు ఎవరైనా వేధింపులకు గురి అయినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 181 ఫోన్ చేసి ప్రభుత్వం ద్వారా సహాయం పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు సీఐ తమీర్ అహ్మద్, డిఎంసి క్రిష్ణ లీగల్ కౌన్సిలర్ రోజా రమణి, మంజరి, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జన్మస్థల శివాలయంపై కక్షపూరిత వైఖరిని విడనాడాలి!

రామచంద్రాపురం, నవంబర్ 3 ప్రభాతవార్త: జన్మస్థల శివాలయంపై కూటమి నాయకులు కక్షపూరిత వైఖరిని విడనాడాలని వైసిపి మండల అధ్యక్షుడు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట సుమారు 500 మంది భక్తులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ మధుసూదన్‌రావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన వెంటనే కూటమి నాయకులు వందల ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములను ఆక్రమించుకున్నప్పుడు ప్రజాప్రతినిధులుగానీ, అధికారులుగానీ పట్టించుకున్న దాఖలాలు లేవని దుయ్యబట్టారు.పార్టీల కతీతంగా జన్మస్థల శివాలయాన్ని సందర్శించి, రాజకీయ వైరుధ్యాలను త్యజించి నిర్మాణ పనులకు ట్రస్ట్ చేపడుతున్న చర్యలను ప్రత్యక్షంగా వీక్షించి, ఆలయ పురోభివృద్ధికి కూటమి నేతలు, నాయకులు సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం కోర్టు నోటీసుల పట్ల స్పందించి, కూల్చివేత చర్యలను నివారించాలని కోరారు.

## వార్తా ప్రభావం...గోడను పరిశీలిస్తా తహసిల్దార్

రేణిగుంట నవంబర్ 3 ప్రభాతవార్త : మండలం పాపానాయుడుపేటకు వెళ్లే సర్వీస్ రోడ్డు పక్కన నిర్మించిన గోడ విషయమై వార్త దినపత్రికలో ప్రచురించిన కథనానికి రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తక్షణం స్పందించారు. రోడ్డు వల్ల ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరు అంటూ వార్త దినపత్రిక అధికారులను ప్రశ్నించింది. వార్త కథనానికి తహసిల్దార్ స్పందించి మంగళవారం రెవెన్యూ అధికారులతో వెళ్లి అక్కడ పరిశీలించి నిజా నిజాలు నిగ్గు తేల్చి ప్రజోపకరమైన విధానానికి గోడ అడ్డువస్తే ఉన్నతాధికారుల అనుమతితో తప్పక తొలగిస్తామని హామీ ఇచ్చారు.

## పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 3 ప్రభాతవార్త :సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ విడుదల చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు మనలో ఒక భాగం అని వారి చిన్న చిన్న చిరునవ్వులు, ఆటలు, కలలు మన జీవితాన్ని పూర్తి చేస్తాయని,కానీ, కొందరు పిల్లలు ప్రత్యేక అవసరాలతో జన్మించి, మన సమాజంలో సమాన అవకాశాలు లేకుండా ఉండటం బాధాకరం అన్నారు. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా, ఇలాంటి పిల్లలను చట్టబద్ధంగా, నైతికంగా మరియు సమగ్రంగా దత్తత తీసుకోవడం సాధ్యమేనన్నారు. ఈ కార్యక్రమములో ఎస్ వసంత బాయి ఐ.సి.డి.ఎస్ పి.డి, బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ వసంత డీసీపీఓ శివ శంకర్, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తొట్టంబేడు,నవంబర్ 3 ప్రభాతవార్త: మండలంలోని పొయ్య,పొయ్యకొత్తూరు గ్రామాల్లో సోమవారం కార్తీక మాసం ప్రాధాన్యతను వివరిస్తూ త్రైత సిద్ధాంత సంఘం ప్రచార రథం ద్వారా 'భగవద్గీతపై విస్తృత ప్రచారం నిర్వహించారు. రాబోవు కార్తీక పౌర్ణమికి సంబంధించి దీపాలు ఎందుకు వెలిగించాలి? అందులో జ్ఞానం ఏమిటో ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు.ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటి అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం సారధ్యంలో మహిళలు ఇంటింటికి వెళి అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు అమరావతి, వెంకటరత్నమ్మ,వెంటకలక్ష్మీ, చామంతి లీలా కృష్ణ,ప్రభోధ కృష్ణ, ధనయులు, శ్రీదేవిలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

## మాజీ వీఆర్ఓ ఇంట్లో...పట్టాదారు పాసుపుస్తకాలు



తొట్టంబేడు,నవంబర్ 3 ప్రభాతవార్త : మండలంలోని కాసరం గ్రామంలో ప్రభుత్వ భూముల పట్టాలు ఓ మాజీ వీఆర్ఓ ఇంట్లో పెట్టుకొని లబ్దిదారులకు తిప్పలు పడుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. మాజీ వీఆర్ఓ తమ పలుకుబడితో గతంలో రికార్డులను తమ పరిధిలో పెట్టుకొని పబ్బంగడుపు కుంటూ పేదల జీవితాలతో ఆటలాడుకుంటు న్నారని బాధితులు వాపోతున్నారు. గతంలో బినామి పేర్లతో పట్టాలు తయారు చేసుకొని తన వద్ద ఉన్న పట్టాలను దశల వారిగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఈ అక్రమాలకు సంబంధించి ఎన్ని సార్లు పేదలు అధికారులకు, పాలకులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే దిక్కులేదు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నిరుపేదలకు న్యాయం జరగటం లేదని వాపోతున్నారు. ఈ సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## బోనుపల్లి విద్యార్థి ప్రతిభ



తొట్టంబేడు,నవంబర్ 3 ప్రభాతవార్త: మండలం లోని బోనుపల్లికి చెందిన విద్యార్థిని మహిజ తమ ప్రతిభను చూపి భారత రాజ్యాంగ దినోత్సవానికి ఎంపికైనట్లు పలువురు అభినందించారు.రాష్ట్ర ప్రభుత్వం భారత రాజ్యాంగంపై నిర్వహించిన పోటీల్లో మండలంలోని బోనుపల్లికి చెందిన మహిజ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 26న రాష్ట్ర రాజధాని అమరావతి అసెంబ్లీలో పాల్గొనే అవకాశం లభించింది. ఈ కార్యక్రమాల్లో డిఐఇఓ మహేశ్వరరావు, ఎంఇఓ బాలయ్య, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు చిరంజీవులు, బోనుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి,గైడ్ టీచర్ ఆదూరు శంకర్‌రెడ్డిలు విద్యార్థిని సత్కరించారు.

## రోహిత్‌ను సత్కరించిన నాయకులు



తొట్టంబేడు,నవంబర్ 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తికి వచ్చిన సినీ నటుడు చంద్రగిరి నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు నారా రామమూర్తి నాయుడు తనయుడు నారారోహిత్ నూతనంగా వివాహం చేసుకొని శ్రీకాళహస్తీశ్వరాల యానికి వచ్చారు. స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్న వారికి తొట్టంబేడు మండలంలోని తెలుగుదేశం నాయకుడు కన్నలి ప్రతాప్‌రెడ్డి దుశ్శాలువతో సత్కరించి,స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు.

## డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి శ్రీకారం

-వినియోగదారుల విద్యుత్ సమస్యలు పరిష్కారానికి కొత్త దిశగా అడుగు

-ఏపిఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



తిరుపతిరూరల్, నవంబర్ 3 ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారుల సమస్యలను ప్రత్యక్షంగా వినిపించి, సత్వర పరిష్కారం చేయడానికి ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణి సంస్థ (ఏపిఎస్పీ డిసిఎల్) కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. "డయల్ యువర్ సిఎండి" పేరుతో ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తిరుపతి కార్పోరేట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి రాష్ట్రంలోరి తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 87మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను నేరుగా సిఎండి దృష్టికి తీసుకొచ్చారు.

**సిఎండికి ప్రస్తావించిన సమస్యలు:**

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్స్ మంజూరు, గృహాలపై వెళ్ళుతున్న లైన్లు, పాఠశాల ప్రాంగణంలో ఉన్న విద్యుత్ లైన్ల మార్పు, కాలిపోయిన లేదా చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు జాప్యం, లో ఓల్టేజ్ కారణంగా పరికరాలు దెబ్బతినడం విద్యుత్ స్తంభాల మార్పు, లైన్లకు దగ్గరగా చెట్టు కొమ్మలు ఉండటం, సరఫరాలో అంతరాయాలు వంటి అంశాలు ఉన్నాయి.

**సిఎండి శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ :**

వినియోగదారుల సమస్యలను స్వయంగా తెలుసుకుని తక్షణమే పరిష్కరించడమే మా ఉద్దేశమని, అందుకే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి జిల్లాకు ఒక చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్‌స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు. వినియోగదారుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి, అవి పరిష్కారం అయ్యేంతవరకు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ చర్యతో జెఎల్‌ఎం నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్ వరకు అన్ని స్థాయిల్లో పనితీరు మెరుగవుతుందని తెలిపారు. వినియోగదారుల సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని సిఎండి పేర్కొన్నారు. అలాగే సమస్యల పరిష్కారంలో అలసత్వం చూపే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిఎండి సూచనల ప్రకారం వినియోగదారులు కేవలం ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800 425 155333, అలాగే వాట్సప్ నెంబర్ 9133331912 ద్వారా కూడా తమ సమస్యలను తెలియజేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్స్ పి.ఆయుబ్‌ఖాన్, కె,గురవయ్య, కె.రామమోహన్‌రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు పిహెచ్.జానకిరామ్, జె,రమణాదేవి, కె.ఆదిశేషయ్య, యం.ఉమాపతి, యం.మురళీకుమార్, జనరల్ మేనేజర్లు సి.హెచ్.రామచంద్రరావు, జి.చక్రపాణి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, డి.జగదీష్, తిరుపతి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తెప్పపై కనువిందు చేసిన కల్యాణవేంకటేశ్వరుడు



నారాయణవనం, నవంబర్ 3 ప్రభాతవార్త :మండల కేంద్రంలోని పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మూడవ రోజు తెప్పపై శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుడు ఘనంగా ఊరేగారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అమ్మవారిని, స్వామివారికి ఉదయం సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, నిత్యకైంకర్య పూజయ బలి, శాత్తుమొర నిర్వహించారు. అనంతరం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. అనంతరం 10 గంటలకు శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరునికి స్నపనతిరుమంజనం నిర్వహించారు. పుష్కరణిలో సాయంత్రం నిర్వహించిన తెప్పోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుత్తూరు రూరల్ సిఐ సురేష్‌కుమార్, స్థానిక ఎస్ఐ పరమేష్‌నాయక్, టిటిడి విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది గట్టి బందోబస్తును చేపట్టారు. కార్యక్రమంలో సూపరిడెంటెండ్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్‌పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు, శ్రీనివాసభట్టాచార్య, నరసింహారాఘవ భట్టాచార్యలు, భక్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి : ఏపీడీ



బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 3 ప్రభాతవార్త: వెలుగు సమైక్య సంఘాల ద్వారా మహిళలు సంఘ సభ్యులు రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జీవన ఉపాధిలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీడీ ప్రభావతి సమావేశంలో పిలుపునిచ్చారు. మండలం వెలుగు కార్యాలయంలో వీవోఏలతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తిరుపతి జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలు వారికి ఏ నెలలో ఏ అవసరానికి ఎంత కావాలనేది వార్షిక రుణ ప్రణాళిక సభ్యురాలు వారిగా బయోమెట్రిక్ అథ్లెంటికేటిన్‌తో తయారు చేయడం జరిగింది. సమావేశంలో డీపీఎం సీబీఐ ఫైనాన్స్ వనజాక్షి, రైతు ఉత్పత్తి దారులు సమాఖ్య జిల్లా ఏపీఎం దాక్షాయని, ఉన్నత జిల్లా ఏపీఎం విజయకుమార్, స్త్రీనిధి మేనేజర్ వనజ, సీసీలు వెంకటరత్నం, వీరజిన్న, జీవన, మండల సమాఖ్య లీడర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

## ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

కేవీబీపురం, నవంబరు 3 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కేవీబీ పురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలని పలువురు మండల కేంద్ర ప్రజలు వాపోతున్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సచివాలయంలో ఒకటి, రెండు చోట్ల తప్ప అన్ని సచివాలయాల్లో కూడా డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఆధార్ వివరాలు నమోదు చేసుకోవాలన్నా ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని, ఎక్కడో సుదూర ప్రాంతంలో వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చొరవ చూపి ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## అంకాళమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



పుత్తూరు రూరల్, నవంబరు 3 ప్రభాతవార్త: పుత్తూరు మండలం తిరుమల కుప్పం అంకాళమ్మ ఆలయ కుంభాబి షేకంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేకు పూలవ రాలలు వేసి శాలువ కప్పిఘనంగా సన్మానించారు. టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శివాలయాల్లో కార్తీకమాస పూజలు

పుత్తూరు రూరల్, నవంబరు 3 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీకమాసం సందర్భంగా విశేష పూజలు చేశారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి శ్రీ రామలింగేశ్వర స్వామి, అలాగే మండల పరిధిలోని తొరూరు, తిరుమలకుప్పం గ్రామాల్లో వెలసిన శివాలయాల్లో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. అలాగే పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై పిండి దీపాలు పెట్టి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందించారు.

## గూళూరు చెరువు సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే



వడమాలపేట, నవంబరు 3 ప్రభాతవార్త: మండల పరిధిలోని గూళూరు చెరువు సమస్యలపై ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. ఎస్‌బీఆర్ పురం గ్రామస్తులు గూళూరు చెరువు నిండి ఉండడంతో ముంపు పట్టాలు ఉన్న రైతులు 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని, ఆది ఆంధ్రవాడ ముంపు గురయ్యే ప్రమాదం ఉందని, తూములు మరమ్మతులు చేయా లంటూ బాధిత ఎస్‌బీఆర్ పురం గ్రామస్తులు సోమవారం తిరుపతిలోని ఆయన నివాసంలో విన్నవించారు. జిల్లా అధికారులచే క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు.

## ఆలయ అభివృద్ధే లక్ష్యం : శంకర్‌రెడ్డి



సత్యవేడు, నవంబరు 3 ప్రభాతవార్త: సత్యవేడు నియో జకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసెల్లుతున్న శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయ ంలో భక్తుల సేవ కోసమే ధర్మకర్తల మండల సభ్యులు పునరంకితం కావాలని నియోజకవర్గ టీడీపీ కార్యక్రమాల సమన్వ యకర్త కూరపాటి శంకర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పద్మనాభరాజు ఆధ్వర్యంలో జరిగిన ధర్మకర్తల మండల సభ్యుల ఆత్మీయ సమావేశానికి ఆయన అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, డీసీసీ బ్యాంకు చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, చందన స్రవంతి అన్న అనిత, మాధవనాయుడు, శ్రీనివాసులు నాయుడు, కన్నయ్య నాయుడు, సతీష్ నాయుడు, గిరిబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ పార్టీకి చేసిన సేవలను గుర్తించడం వల్లే ధర్మకర్తల మండలి చైర్మన్‌గా పద్మనాభరాజును వరించిందన్నారు. ఆలయ ప్రాచుర్యం, చరిత్రపై పలువురు మాట్లాడారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ కార్యక్రమాల సమన్వయకర్త శంకర్‌రెడ్డి 15లక్షలు సొంత నగదును ఆలయ కార్య నిర్వాహణాధికారి లతకు అందించారు. ఈ క్రమంలో శంకర్‌రెడ్డి ధర్మకర్తల మండలిసభ్యులకు శాలువ కప్పి సత్కరించారు. ఆత్మీయ సమావేశాన్ని పురస్కరించుకుని సాంస్కృతికకార్యక్రమాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

## బౌన్సర్లు మధ్య సురుటుపల్లి చైర్మన్ ఆత్మీయ సమావేశం



సత్యవేడు, నవంబరు 3 ప్రభాతవార్త: సత్యవేడు నియోజక వర్గంలోని నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయం భక్తి క్షేత్రంగా వెలుగొందా ల్సిన చోట సోమవారం అధికార అహంకారం ఉప్పొంగి పోయింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పద్మనాభ రాజు అత్యుత్సాహం భక్తుల మనసుల్లో ఆవేదన రేపింది. ఆయన నేతృత్వంలో జరిగిన ధర్మకర్తల మండలి సభ్యుల ఆత్మీయ సమావేశం భక్తి సమారాధన కాకుండా స్వప్రచార సభగా మారిపోయింది. పిచ్చాటూరు నుంచి ర్యాలీగా బయలుదేరిన బృందం సురుటుపల్లికి చేరి రాజకీయ నాయకులను వెంటబెట్టుకుని శివాలయ పవిత్రతను ఆర్భాటాల బారిన పడేసింది.

## రోడ్డు ప్రమాద బాధితుని పరామర్శించిన ఎమ్మెల్యే



విజయపురం, నవంబరు 3 ప్రభాతవార్త: మండలంలోని ఆలపాకం కండ్రిగ గ్రామానికి చెందిన శరవణ అనే అబ్బాయి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ నేపథ్య ంలో సోమవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నేరుగా వారి ఇంటికి వెళ్లి గాయపడిన శరవణను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**నూతన దంపతులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం:**

మండలంలోని కేశవపురం గ్రామంలో నూతనంగా పెళ్లి చేసుకున్న కొండూరు దామోధరం, గాయత్రిల ఇంటికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వెళ్లి ఆశీర్వదించారు. వీరితో పాటు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా...మాజీ మంత్రి

విజయపురం, నవంబరు 3 ప్రభాతవార్త: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ మంత్రి రోజా మండలంలోని ఇళ్ళత్తూరులో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోజా మాట్లా డుతూ వైసీపీ హయాంలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు ఆమోదించ బడ్డాయని, వాటిలో ఏడు మెడికల్ కాలేజీలు పూర్తిగా నిర్మాణం జరిగిందని, 10 కాలేజీలు పెండింగ్ నిలిచిందన్నారు. అన్ని పనులు పూర్తి చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటన్నింటిని ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది పేద విద్యార్థులకు పెద్ద శాపమని, అందరం ఐక్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎంపీపీ మంజు బాలాజీ, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వైసీపీ విభాగం ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌నాయుడు, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, నాయకులు శేఖర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, గోపిరాజు,సుబ్బు యాదవ్, నారపరాజు పాల్గొన్నారు.

## దోబీఘాట్ కాపాడాలని రజకులు వినూత్న నిరసన



తిరుపతిరూరల్, నవంబర్ 3 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ వేదాంత పురం గ్రామ పంచాయతీలోని సర్వేనెంబర్ 214లో ఉన్న 54సెంట్ల విలువైన భూమిని కాపాడాలని రజకులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేసారు. సోమవారం ఏపి రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రాస్ ఆఫీస్ నుండి మాసిన బట్టలు నెత్తిన పెట్టుకుని తిరుపతి రూరల్ తహశీల్దార్ కార్యాలయం వరకు నడిచారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు బట్టలు ఉతుకుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిరుపతిరూరల్ కార్యధర్శి కె.సుమన్, సిఐటియు జిల్లా నాయకులు చిన్నబాబు, రజక సంఘం నాయకులు మధు, సురేంద్ర, భాస్కర్, రమణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో నగర్ అభివృద్ధికి సహకరించండి

తిరుపతి కార్పొరేషన్,నవంబర్3 ప్రభాతవార్త: తిరుపతి రేణిగుంటరోడ్డులో తుడ పరిధిలో ఉన్న ఎస్వీ ఆటోనగర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి, మౌళిక వసతులు కల్పించేందుకు తుడ నుండి సహకారం అందించాలని తుడ చైర్మన్ సి.దివాకర్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. సోమవారం ఉదయం తుడ కార్యాలయంలో ఆటోనగర్ సర్వీస్‌సొసైటీ సభ్యులు ఆయన్ను కలిశారు. ఆటోనగర్‌లో వర్షాకాలంలో రోడ్లుపూర్తిగా దెబ్బతిన్నాయని, వర్షపునీరు ఆగిపోయి మురికి గుంటను తలపింపజేస్తోందని, మురికి కాలువలు నిర్మించాలని, వెడల్పు చేయాలని కోరారు. మౌళిక వసతులు కల్పించి ఆటోనగర్‌లో కార్మికులు, స్థానికుల అవస్థలు తొలగించాలని కోరారు. మీ నుండి సహకారం అందించి ఆటోనగర్‌ను అభివృద్ధి చేయాలని సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు లోకనాథరెడ్డి, కార్యదర్శి శివకుమార్, సరితానాగరాజురాయల్ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన్ను సన్మానించారు.

## పిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు

తిరుపతి, నవంబర్ 3 ప్రభాతవార్త: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 9 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

**డాక్యుమెంట్ దారిపోయినది.**

తేది. 25.10.2025న నా క్లయింట్ జంజం యశ్వంత్ తండ్రి జంజం వెంకటేశ్వర్లు, డి.నెం.18-8-22/10, మధురనగర్, తిరుపతి, తిరుపతి జిల్లా, సెల్: 9177883361, 9700752082 ఉ॥ 9.00 గం॥లకు మదనపల్లె వెళ్ళుటకు గాను తిరుపతి బాలాజీ బస్టాండుకు వచ్చారు. అప్పుడు అతని దగ్గరవున్న కవరు దారిపోయి నది. అందులో జంజం సిద్దయ్య శెట్టి తండ్రి లేట్ జంజం గంగయ్య అను పేరుపై గల తేది. 05.03.1979 డాక్యుమెంట్ నెం. 483 / 1979గా రిజిస్టరు కాబడిన ఒరిజినల్ డాక్యుమెంట్ వుంది. కావున పై విక్రయ పత్రం ఎవ్వరికైనా దొరికిన యెడల క్రింది అడ్రస్సుకు లేదా మొబైల్ నెంబరుకు 7 రోజుల లోగా తెలుపగలరు.

**చిట్టి రెడ్డెప్ప**, అడ్వకేట్, నెం.8-18, 1వ అంతస్తు, రాయల్ నగర్, ఆర్.సి. రోడ్డు, తిరుపతి, ఆ.ప్ర.-517501 సెల్: 9700752082, 9885504158

## వాహన సురక్షిత ప్రమాణాలపై అవగాహన ఉండాలి

-రవాణా అధికారి మురళీమోహన్



తిరుపతి రవాణా,నవంబర్3 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్‌బస్సులు, కాంట్రాక్టు క్యారేజీ బస్సుల డ్రైవర్లకు వాహన సురక్షిత ప్రమాణాలపై అవగాహన ఉండాలని తిరుపతి రవాణా అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. బస్సు యజమానులు, నిర్వాహకులు డ్రైవర్లకు సూచనలు చేయాలని, అనుభవం, అవగాహన ఉన్నవారినే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రైవేట్ బస్సులు ప్రమాదాలకు గురవుతున్న సమయంలో నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం తిరుపతి జిల్లా రవాణశాఖ కార్యాలయంలో ఆర్టీఓ కొర్రపాటి మురళీ మోహన్, ఎంవిఐలు వనం వెంకట సుబ్రమణ్యం, అతికానాజ్, మోహన్ కుమార్, ఆంజనేయప్రసాద్, పరిపాలన అధికారి విజయకుమార్, యువకిశోర్, ప్రైవేట్ ట్రావెల్స్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు రూపేష్‌కుమార్, కార్యదర్శి ఖాదర్‌బాష,నిర్వాహకులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank Together we can

పద్మావతిపురం శాఖ (13245), తిరుపతి. సెల్: 8985998405 / 9949161000

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినసూ బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 13.11.2025 వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:14.11.2025 సా.4.00గం॥లకు** లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| క్ర.నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180105287958 | జి.శ్రీనివాసులు,తండ్రి గంగయ్య, డి.నెం.19-3-1/ఏ27, తిరుచానూరు రోడ్డు, తిరుపతి, తిరుపతి జిల్లా | 16.00 | 75,423.85 |

తిరుపతి, తేది: 03.11.2025 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

## ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయండి



రేణిగుంట నవంబర్ 3 ప్రభాతవార్త ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లలో పక్కాగా రిజర్వేషన్లు అమలు చేయాలని ఆర్టీసీ బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబేద్కర్ స్టార్ కృష్ణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో కపిల తీర్థం సమీపంలో అత్యధిక సౌకర్యాలతో ఏర్పాటుచేసిన ఆర్టీసీ డిస్పెన్సరీని మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టార్ కృష్ణ మంత్రిని ఘనంగా సత్కరించి తమ డిమాండ్లను మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో ఆర్టిసి చైర్మన్ కొనకళ్ళ నారాయణ, ఎండి ద్వారక తిరుమలరావు, తుడా చైర్మన్ బాలన్స్ దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఈడీలు పైడి చంద్రశేఖర్, ఇమ్మడి చెంగల్రెడ్డి, డిప్యూటీ సిపిఎం విశ్వనాథ్, డిప్యూటీ సీఎం బాలాజీ, తిరుపతి రీజియన్ లోని అన్ని డిపోల మేనేజర్లు, అసోసియేషన్ నాయకులు, విశ్రాంత ఉద్యోగ నేతలు, ఎస్సీ నాయకులు అంజప్ప, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank Together we can

తిరుపతి బైరాగిపట్టెడ శాఖ, తిరుపతి. సెల్: 83338 25174 / 98664 06180

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినసూ బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 14.11.2025 వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:15.11.2025 సా.4.00గం॥లకు** లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| క్ర.నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180406074012 | శ్రీ కోడూరు హరి ప్రసాద్, తండ్రి కె.సుబ్బయ్య, 13/6/600/44/200, పెద్దకాపులేఔట్, తిరుపతి, తిరుపతి రూరల్, ఆంధ్రప్రదేశ్ | 42.4 | 2,63,009.63 |
| 2 | 180406076504 | | 516. | 3,12,938.27 |
| 3 | 180406076901 | | 41.0 | 2,34,925.21 |

తిరుపతి, తేది:03.11.2025 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

## శ్రీసిటీని సందర్శించిన... యుఎన్ విజన్ దౌత్యవేత్త



శ్రీసిటీ (తడ), నవంబర్ 3 ప్రభాతవార్త: మాస్కోలోని ఇంటర్నే షనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫర్మేషన్ నిపుణుడు, యుఎన్ విజన్ దౌత్యవేత్త జయ రాములు లింగుట్ల సోమవారం ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శిం చారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతల గురించి వివరించారు. శాస్త్రీయ ప్రణాళిక, దార్శనిక నాయకత్వంతో రూపొందించబడిన శ్రీసిటీ, దాని ప్రాంతీయ సామర్థ్యాలను ప్రపంచ స్థాయికి చేర్చిందని ఈ సందర్భంగా డా. సన్నారెడ్డి పేర్కొన్నారు. ఐసీఎస్టీఐ, యునైటెడ్ నేషన్స్ వంటి అంతర్జాతీయ సంస్థలతో కలిసి పరిశ్రమ–విద్యా సమన్వయ విధానాలను అభివృద్ధి చేయడం శ్రీసిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. శ్రీసిటీ వేగవంతమైన అభివృద్ధిని ప్రశంసించిన జయ రాములు, 31 దేశాలకు చెందిన 245కుపైగా సంస్థలు ఇక్కడ స్థాపించబడ టాన్ని అభినందించారు. అలాగే ఐఐఐటీ, క్రియా యూనివర్సిటీ, ఐఎఫ్ఎంఆర్ బిజినెస్ స్కూల్ వంటి విద్యాసంస్థలతో శ్రీసిటీ విద్యా రంగంలో కూడా విశేష పురోగతి సాధించడాన్ని ఆయన కొనియాడారు. శ్రీసిటీ, పరిశ్రమలు, ప్రభుత్వాలు కలిసి చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ద్వారా స్థానిక యువతకు పరిశ్రమలలో అవకాశాలు కల్పిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. శ్రీసిటీలోని రష్యన్ కంపెనీ కూబిషెవ్ అజోట్ సహా పలు పరిశ్రమలని ఆయన సందర్శించి, పరిశ్రమ–విద్యా సమన్వయ అనుకూల అంశాలను పరిశీలించారు. అంతర్జాతీయ నైపుణ్య విశ్వవిద్యాలయం స్థాపనకు శ్రీసిటీ ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## కోట అంటే తెలుగుదేశం పార్టీకి అడ్డా : ఎమ్మెల్యే పాశిం




కోట, నవంబర్ 3 ప్రభాతవార్త: ప్రతిసారి జరిగే ఎన్నికల్లో కోట మండలంలో తెలుగుదేశం పార్టీకి మంచి మెజార్టీ తీసుకొస్తున్నారని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమ వారం కోటలోని గిరిజన షిఫ్ మార్కెట్‌ను, మహిళా బ్యాంకును, హిందూ శ్మశాన వాటికను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట తెలుగుదేశం పార్టీకి అడ్డాగా నిలుస్తుంద న్నారు. తనకు రాజకీయభిక్ష పెట్టింది నల్లపరెడ్డె అని మరోసారి గుర్తుచేసుకున్నారు. ఆనాడు నల్లపరెడ్ల దయతోనే తాను మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానన్నారు. అనంతరం నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్థలదాత అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డికి, ఈ శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేసిన జెమ్మి ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన శ్మశాన వాటికను రూ.60 లక్షల వ్యయంతో పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.జయజయ రావు, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, వాకాడు ఎఎంసి ఛైర్‌పర్సన్ ప్రమీల, ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు దశరధరామిరెడ్డి, మహిళా బ్యాంకు ఛైర్మన్ విజయలక్ష్మి, ఫీల్డ్ అధ్యక్షురాలు శేషమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ జయంతి, కొత్తపాలెం సొసైటీ ఛైర్మన్ ఉచ్చూరు రవీంద్రనాథ్‌రెడ్డి, కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, సుష్మారెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ, సర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు...పార్టీ న్యాయం చేస్తుంది




దొరవారిసత్రం, నవంబర్ 3 ప్రభాతవార్త: నెలబల్లి పిఏసిఎస్ ముప్పాళ్ళ శ్రీహరిరెడ్డి ప్రమాణ స్వీకారం సభలో ఎమ్మెల్యే పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. నెలబల్లి పిఏసిఎస్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న ముప్పాళ్ళ శ్రీహరి రెడ్డి పార్టీకి ఎంతో సేవ చేశారని ఆయన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం చైర్మన్ పదవి ఇవ్వడం సంతోషదాయకమని ఆయన దొరవారిసత్రం మండలంలో తెలుగుదేశం పార్టీ అభ్యున్నతి కోసం ఆయన సేవలు పార్టీకి ఇంకా అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. డైరెక్టర్లుగా విజయ్, సుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, తెదేపా దొరవారిసత్రం మండలం అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎంపీటీసీ బందిలి ఉదయ్ కుమార్, యాగని కృష్ణ మూర్తి, వంక సుధాకర్ ప్రవీణ్ నాయుడు, దొరవారి సత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు : మాజీ ఎమ్మెల్యే



దొరవారిసత్రం, నవంబర్ 3 ప్రభాతవార్త: మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు దొరవారిసత్రం మండలం నెలబల్లి పంచాయతీలో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అనేది సామాన్య ప్రజల ఆరోగ్య హక్కును కాలరాసే చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాహుల్ రెడ్డి, మునస్వామి నాయుడు నల్లారెడ్డి సురేష్‌రెడ్డి, రాము వేమురెడ్డి, రజిని తదితరులు పాల్గొన్నారు.

## వినతులు స్వీకరణ

గూడూరు, నవంబర్ 3 ప్రభాతవార్త : డివిజన్ పరిధిలోని సమస్యలు వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని ఎఫ్ఏసి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రదానంగా భూ సమస్యలు మీద వినతులు స్వీకరించారు. త్వరిత గతిన సమస్యలను పరిష్కారిస్తామన్నారు.

## ప్రతి రైతుకు యూరియా అందించాలి

**- ఏపీ కౌలు రైతు సంఘం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్**



గూడూరు, నవంబర్ 3 ప్రభాతవార్త: ప్రతి రైతుకు యూరియా అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం గత పది రోజుల నుంచి గుర్తింపు కార్డు కొరకు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, రైతుల పట్ల వ్యవసాయ శాఖ ఏడి, ఏవోలు దురుసుగా వ్యవహరించడం ఎంత వరకు సబబు అన్నారు. ఈయన వెంట రైతులు నాగరాజు, వెంకట సుబ్బయ్య, రఘు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని... వ్యక్తి మృతి

చిల్లకూరు, నవంబర్ 3 ప్రభాతవార్త: మండలంలోని జ్యోతి కాటా కి సమీపన గల ఎన్‌హెచ్ 16 హైవే రోడ్‌ను చెన్నైకి చెందిన పళని కుమారుడు ఎలుమలై (51) అను లారీ డ్రైవర్ ఈ నెల 2వ తేది రాత్రి సుమారు 10:50 గంటల సమయంలో దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్సై సురేష్ బాబు సంఘటన చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహాన్ని గూడూరు ప్రాంతీయ తరలించారు.

## ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

గూడూరు రూరల్, నవంబర్ 3 ప్రభాతవార్త: రూరల్ మండల పరిధిలోని కందలి, చేమిర్తి రోడ్డు సమీపాన ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ తిరుపతయ్య కథనం మేరకు గూడూరు మండల పరిధిలోని కందలి గ్రామానికి చెందిన కావూరు వెంకట రమణయ్య (50) అనే వ్యక్తి మట్టి అవసరమై ట్రాక్టర్‌లో డ్రైవర్ ప్రక్కన నిలబడి ప్రయాణిస్తుండగా ట్రాక్టర్ గుంటలో పడగా అదురుకి ప్రమాదవశాత్తు వెంకటరమణయ్య ట్రాక్టర్ మధ్యలో పడి టైరు బాడీ మీద ఎక్కడం వలన వెంకట రమణయ్య మృతి చెందాడు అన్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## బీచ్‌ల్లో కార్తిక స్నానాలకు...

### భక్తులు పోలీసులకు సహకరించాలి : మెరైన్ సిఐ

కోట,నవంబర్ 3 ప్రభాతవార్త: ప్రతికూల పరిస్దితులు కార్తిక మాసంలో భక్తులకు సముద్ర స్నానాలు చేయటానికి అవకాశం లేకుండా చేస్తున్నాయి. ఈక్రమంలో కారిక్త పౌర్ణమి ఈ నెల 5న వస్తోంది. బంగాళాతంలో ఈ నెల 4న అల్ప పీడనం ఏర్పడే పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ శాఖ అంచన వేసిందిని మెరైన్ సిఐ వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆరోజు సముద్ర సాన్నాలు పోలీసులు సూచించిన ప్రాంతాల్లోనే స్నానాలు చేయాల్సి ఉందన్నారు. భక్తుల భద్రత దృష్ట్యా సముద్ర స్నానాల ఎక్కడ అంటే అక్కడ చేయడం కుదరదన్నారు. వాకాడు మండలం తూపిలిపాళెం బీచ్ కోట మండలం శ్రీనివాస్ సత్రం వద్ద పోలీసులు బందో బస్తో ఉంటారని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా మైపాడు జీచ్‌లో సముద్ర స్నానం చేస్తూ ముగ్గురు విద్యార్దులు మృతి చెందిన నేపద్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు. సముద్రంలో ఎక్కడ గుంట ఎక్కడ మిట్ట తెలియని పరిస్దితులు ఏర్పడాయన్నారు. భక్తుల కూడా తమకు సహకారించాలని కోరారు.

## భూములను పేదలకు పంచాలి



వెంకటగిరి, నవంబర్ 3 ప్రభాతవార్త: కలపాడు గ్రామ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు వెంటనే కాల్చాలని రాష్ట్ర కలపాడు గ్రామ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు వెంటనే కాల్చాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక గిరిజనులతో కలిసి కలపాడు గ్రామంలో ఉన్న భూములలో ఉన్న చెట్లను తొలగించి ఆక్రమించాడు. ఆయన మాట్లాడుతూ కలపాడు గ్రామంలోని దళితులు, గిరిజనులు, వెనుకబడిన వారి అందరికీ ప్రతి కుటుంబానికి నాలుగు ఎకరాలు చొప్పున భూ పంపిణీ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి వడ్డి పల్లి చెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలకృష్ణయ్య, బాల సుబ్రమణ్యం, చెంచు కృష్ణయ్య, దారా కృష్ణయ్య, తలారి వెంగయ్య, చెంచు రామయ్య, కోడలు మాధురి, గాలి శిరీష కలపాటి మల్లేశ్వరి కలపాడు దళితులు గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వరోత్తమ్‌రెడ్డి ఇంటికి...ఎమ్మెల్యే

కోట,నవంబర్ 3 ప్రభాతవార్త: మండల మాజీ తెదేపా అధ్యక్షులు ఎం.స్వరోత్తమ్ రెడ్డి గత కొంత కాలం నుంచి తెలుగుదేశం పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనకుండా దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపధ్యంలో సోమవారం కోటలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభంచిన శాసన సభ్యులు పాశం సునీల్ కూమార్ ఆయన ఇంటికి వేళారు. ఎందుకు వెళ్లారు ?అనేది అందరిలోనూ చర్చి నడుస్తుంది. ఆయనను తిరిగి పార్టీ కార్యక్రమాల్లో ఉత్సహంగా పాల్గొనేందకు ఎమ్మెల్యే ఆయనను బుజ్జగించినట్ల పార్టీ వర్గాల్లో చర్చకు దారి తీసింది. తెదేపా మండల అధ్యక్షు పదవి ఆయనకు రాకపోవడంతో ఆయన నిరాశలో ఉండి పోయారుని తెలుస్తోంది. ఎమ్మెల్యే వెళ్లి మంతనాలు జరిపిన అనంతరం వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట స్వరోత్తమ్ రెడ్డి పాల్గొన్నారు.

## రామాంజులను సత్కరించిన దేశం నాయకులు



తొట్టంబేడు,నవంబర్ 3 ప్రభాతవార్త : మార్కెటింగ్ కమిటి చైర్మెన్‌గా గతంలో సమర్ధవంతంగా నిర్వహించి ప్రస్తుతం కెవిబిపురం మండల పార్టీ అధ్యక్షుడుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న బీసా బత్తిని రామాంజులు నాయుడును సోమవారం తొట్టంబేడు మండల నాయకులు సత్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి బొజ్జల కుటుంబానికి విశ్వాసంతో మెలగిన రామాంజులు నాయుడు నేటికి పార్టీ ప్రగతికి పాటుపడుతుండటం అభినందనీయం అని దేశం నాయకులు మురళినాయుడు, చీళ్ళ వెంకట మునిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెటింగ్ కమిటి విజయకుమార్‌నాయుడు రైతు విభాగం అధ్యక్షులు గోపినాథ్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి శ్రీహరియాదవ్, మాజీ సర్పంచ్ అవసరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదిదారులకు సత్వర న్యాయం

**-దివ్యాంగుల వద్దకే కదలి వెళ్ళిన ఎస్పీ లంకెల**




తిరుపతి కార్పొరేషన్, నవంబర్3 ప్రభాతవార్త: పలురకాల సమస్యలతో జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన బాధితులందరికీ సత్వర న్యాయం చేస్తామని, బాధితుల సమస్యలు సగౌరవంగా విని వారిని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆప్యాయంగా పలకరించారు. కొందరు దివ్యాంగులు సమస్యలపై ఫిర్యాదులతో హాజరుకావడంతో వారి వద్దకు ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా వెళ్ళి ఫిర్యాదులు స్వీకరించి ఓపికతో విన్నారు.వాటిని బాధ్యతతో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. సోమవారం తిరుపతి జిల్లా పోలీసు కార్యలయంలో మీకోసం ప్రజాసమస్యల పరిష్కారవేదిక జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి బాధితులు తమ సమస్యలతో హాజరయ్యారు. అందరి సమస్యలను ఓపికతో ఎస్పీ సుబ్బరాయుడు విని, వాటి పరిష్కారానికి చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి ప్రజల సమస్యలను గౌరవంగా విని వాటిని పరిష్కరించాలని ,ఆలస్యం జరగకూడదని అన్నారు. ఈ రోజు కార్యక్రమంలో 123 ఫిర్యాదులు స్వీకరించారు. తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరచారి, తిరుమల ఏఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీలు శ్రీనివాసులు, భక్తవత్సలం, సిఐలు పాల్గొన్నారు.

## ఎస్‌వియు రెక్టార్‌ను కలిసిన తిప్పారెడ్డి



తిరుపతి విద్య,నవంబర్ 3 ప్రభాతవార్త: ఎస్‌వియు నూతనంగా రెక్టార్ గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ప్రొఫెసర్ సిహెచ్ అప్పా రావును అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. తిప్పారెడ్డి మాట్లాడుతూ అకాడమిక్ అచీవ్మెంట్‌తో పాటు యూనివర్సిటీ పరిపాలనలో డి ఓ ఏ డైరెక్టర్,డెవలప్మెంట్,సిడిసి డీన్,15 నెలల పాటు ఇన్చార్జి వైస్ ఛాన్సర్గా క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వహించిన ఆచార్య అప్పారావు రెక్టార్గా నియామకం కావడం ఆనందదాయ కమని భవిష్యత్తులో ఆయన ఉన్నత పదవులు అలంకరించే విధంగా ఆ దేవదేవుని ఆశీస్సులు ఆయనపై ఉండాలని కోరారు.రెక్టర్ ను కలిసిన వారిలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.డాక్టర్.బిజయ కుమార్ బెహరా,సెక్రెటరీ ఆర్ లక్ష్మి ప్రసన్న తదితరులు ఉన్నారు.

## ఎన్ సి సి క్రెడిట్ ఎంపిక ప్రక్రియ



తిరుపతి విద్య, నవంబర్ 3 ప్రభాతవార్త: 5 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అనూజ్ వాద్వా ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి మహిళ డిగ్రీ,పీజీ కళాశాలలో 2025-2026వ సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఎన్‌సిసి క్రెడిట్ ఎంపిక ప్రక్రియ జరిగినది.ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థినిలు పాల్గొనగా ప్రతిభ ఆధారంగా 63 మంది విద్యార్థినులను ఎంపిక చేయడం జరిగినది.ఈ కార్యక్రమమునకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ అధ్యక్షత వహించడమైనది.ఎంపిక జరిగిన విద్యార్థినులను అభినందించి ప్రోత్సహించారు.

## జగనన్న కాలనీ సమస్యలను పరిష్కరించండి

రేణిగుంట నవంబరు 3 ప్రభాతవార్త : మండలం జి.పాలెం పంచాయితీ కుర్రకాలవ జగనన్న కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని రేణిగుంట మండల సిపిఐ పార్టీ సెక్రెటరీ వైయస్ మణి డిమాండ్ చేశారు. కాలనీలో మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మొన్న కురిసిన వర్షాలకు సరైన రహదారి సౌకర్యం, మీరు వెలుపలకు పోవడానికి కాలువలు లేక ఆ ప్రాంతవాసులు పునరావాస కేంద్రాల్లో తలదాచు కోవాల్సి న పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కార్తిక్, సెల్వ, అమ్ములు, శివగామి, మణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు..

## లాన్ టెన్నిస్ రాష్ట్ర పోటీల్లో సత్తా చాటిన చిత్తూరు జిల్లా

శ్రీకాళహస్తి,నవంబర్ 3 ప్రభాతవార్త: మూడు రోజుల పాటు శ్రీకాళహస్తిలోని విక్రం టెన్నిస్ ఆకాడమి ఆవరణలో జరిగిన లాన్‌టెన్నిస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లాకు చెందిన క్రీడాకారులు తమ సత్తా చూపి ఎక్కువ మంది ఎంపికయ్యారు.రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన 390 క్రీడాకారుల్లో ఒక్కొక్క విభాగానికి సంబందించి ఐదేసి మంది క్రీడాకారులను ఎంపిక చేయగా ఎక్కువ మంది ఉమ్మడి చిత్తూరుజిల్లాకు చెందినక్రీడాకారులు గెలవటం అభినందనీయమని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్ అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు,యువ నాయకుడు నారాలోకేస్,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. తిరుపతిజిల్లా క్రీడాకారులనుప్రోత్సహించుటకు శాప్ చైర్మెన్ రవినాయుడు ఎప్పటికప్పుడు చొరవ చూపుతున్నారన్నారు. శ్రీకాళహస్తి టెన్నిస్ పోటీలకు పెట్టింది పేరు అన్నారు.సుమారు 35 సంవత్సరాల పాటు రిపబ్లిక్ క్లబ్ సారధ్యంలో జాతీయస్థాయిలో టెన్నిస్ పోటీలు నిర్వహించిన ఘనత ఉందన్నారు.

**చిత్తూరు క్రీడాకారుల ప్రతిభ:**



శ్రీకాళహస్తిలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీల్లో 14,17,19 సంవత్సరాల లోపు పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయిలో వచ్చే నెల ఢిల్లిలో జరిగే పోటీలకు రాష్ట్రం నుంచి పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేసారు. చిత్తూరుకు చెందిన 19సంవత్సరాల లోపు బాలురల్లో తనీష్‌రెడ్డి, వైష్ణవ సాయిరెడ్డి, బాలికల్లో మనస్వి, తన్విశ్రీ,17 సంవత్సరాల లోపు బాలురల్లో సాయికుమార్ బాలికల్లో సాయిసంజనరెడ్డ సుహేరా అన్సారి,విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించి చితూరుజిల్లా పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసారు. కాగా ఒరెండవ స్థానంలో గుంటూరు జిల్లాకు దక్కింది. ఇక్కడ నుంచి నలుగురు ఎంపికయ్యారు. మూడవ స్థానం కృష్ణాజిల్లా దక్కించుకుంది. బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్యఅతిధిగా కోలా ఆనంద్ హాజరు కాగా అతిథులుగా విక్రమ్ టెన్నిస్ ఆకాడమి డైరెక్టర్ డాక్టర్ జి.,చంద్రశేఖర్, తెలుగుదేశం నాయకులు రవిబాబురెడ్డి, సుధాకర్, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కిషోర్ కోచ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం : ఎమ్మెల్సీ



గూడూరు రూరల్, నవంబర్ 3 ప్రభాతవార్త: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు చంద్రబాబు నాయుడు అప్పనంగా కట్టబెట్టడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా సోమ వారం గూడూరు మండలం విందూరు, రామలింగాపురం గ్రామాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడి కల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు చంద్రబాబు నాయుడు అప్పనంగా కట్టబెట్టడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా రని అన్నారు. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. గూడూరు మండల అధ్యక్షులు మల్లు విజయకుమార్ రెడ్డి, జడ్పిటిసి యామిని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ మహేంద్ర రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు మెట్ట రాధాకృష్ణ రెడ్డి, గూడూరు నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు యళ్ల శ్రీనివాసులు రెడ్డి, గూడూరు పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు జనార్దన్ రెడ్డి, బ్యాగుపూడి కృష్ణారెడ్డి మనుబోలు కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షులు చల్లా తిరుపాలు, విందూరు గ్రామ అధ్యక్షులు కేసి రెడ్డి శంకర్ రెడ్డి, దువ్వూరు సుధాకర్ రెడ్డి, విందూరు ఎక్స్ సర్పంచ్ కొండ కోటేశ్వరరావు, విందూరు ఎక్స్ ఎంపీటీసీ తాటిరెడ్డి శివకోటరెడ్డి, కొండ నారాయణ, పుష్పాల రామ్మూర్తి, రామలింగాపురం గ్రామ అధ్యక్షులు అట్ల శ్రీనివాసులురెడ్డి, నీలం సుధాకర్ రెడ్డి, అంకిరెడ్డి జనార్దన్ రెడ్డి, జైరెడ్డి ప్రదీప్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వినోద్ రెడ్డి, జి శ్రీనివాసులు, ఏ సుధాకర్, ఈశ్వర్, కార్యకర్తలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వినతిపత్రాలను సత్వరమే పరిష్కరిస్తాం



వెంకటగిరి, నవంబర్ 3 ప్రభాతవార్త: ప్రజా విజ్ఞప్తుల దినంలో ప్రజా విజ్ఞప్తుల దినంలో సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను పరిశీలించి పరిష్కరిస్తామని తహశీల్దార్ నరసింహారావు తెలిపారు. కౌన్సిలర్, వెంకటగిరి నియోజకవర్గ వైయస్ఆర్‌సిపి పార్టీ ఆర్‌టిఐ విభాగపు అధ్యక్షుడు ఆరి శంకరయ్య బొగ్గులు మెట్టలో ఉన్న సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకొని వెళ్లారు. మున్సిపాలిటి సుధర్శన్ నగర్ సచివాలయంలో ప్రజా విజ్ఞప్తుల రోజు జరిగింది. ప్రజాల దగ్గరనుండి అర్జీలు స్వీకరించారు.

## సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా



వెంకటగిరి, నవంబర్ 3 ప్రభాతవార్త: సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేస్తామని ఏడిఏ పి. అనసూయ తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలలో రబీ సీజనుకి నారు మడులు, నాట్లు ప్రారంభం కానున్న సందర్భంలో రైతు సేవా కేంద్రాలకు, సొసైటీలకు యూరియాను సరఫరా చేయుచున్నామని తెలిపారు. వ్యవసాయ అధికారులు ప్రతి ఒక్క డీలర్‌ను సొసైటీను మరియు రైతు సేవా కేంద్రాలను పరిశీలించి యూరియాను, యూరియా పంపిణీ కార్డు ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ వ్యవసాయ అధికారులు జి ప్రవీణ పి సుజాత, పి. శిరీష, టీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## అభివృద్ధిపై దృష్టి పెట్టండి



వాకాడు, నవంబర్ 3 ప్రభాతవార్త: మండల పరిధిలోని అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల టిడిపి కమిటీ ఎంపీడీవో సాయి ప్రసాద్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం లోని మండల టిడిపి కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు ఉచ్చూరు లక్ష్మిప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు జనార్దన్‌రెడ్డిలు ఎంపీడీవో సాయిప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి భేటీ అయ్యారు. తుఫాన్‌కు ముందే బాధితులకు రేషన్ నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా మండలంలోని పలు విషయాలు ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లారు.

## కార్తీక సోమవార పూజలు



సూళ్లూరుపేట, నవంబర్ 3 ప్రభాతవార్త : పట్టణంలో కార్తీక మాసం రెండవ సోమవారాన్ని పురస్కరిం చుకుని శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అలంకారాలు చేశారు. స్వామివారికి రుద్రాభి షేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించు కున్నారు. అలాగే శ్రీ అభయశంకర దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకారాలు చేశారు. భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. నాగేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ప్రధాన అర్చకులు పేటేటి సునీల్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అభయ శంకర దేవస్థానంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో అర్చకులు రమణయ్య నేతృత్వంలో పూజలతో పాటు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

## ప్రజా సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా పని చేద్దాం : ఎమ్మెల్యే



బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 3 ప్రభాత వార్త: ప్రజా సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. సోమవారం అభివృద్ధి పనుల్లో భాగంగా మండలంలోని నీర్పాకోట గ్రామంలో 20 లక్షల రూపాయలు నిధులతో కమ్యూనిటీ హాలు భవనం, 37 లక్షల నిధులతో 40 వేల నీటి సామర్థ్యం కలిగిన తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గ ప్రజలు నా మీద నమ్మకంతో నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారని వారి రుణం తీర్చుకునేందుకు ప్రతిక్షణం పని చేస్తానని, రాజకీయ కక్షలతో ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు.కూటమి ప్రభుత్వం ద్వారా నియోజకవర్గ ప్రజలకు అర్హత కలిగిన లబ్ధిదారులకు పింఛన్, పక్కా గృహ నిర్మాణ పనులు, ప్రభుత్వం నిర్ణయించి అర్హత కలిగిన వారికి ఇంటి పట్టాలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం ద్వారా అందించడం జరుగుతుందని తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆటంకం కలిగించే నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని ఎన్‌టీఆర్ నగర్‌కి చేరుకుని జనసేన నేత కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. నీర్పాకోట గ్రామ సర్పంచ్ ఆరని విద్యనాథరెడ్డి మాట్లాడుతూ నీర్పాకోట గ్రామ అభివృద్ధిలో ఎమ్మెల్యే ఆదిమూలం ఎంతో సహకరించారని గ్రామం ఆయన రుణం తీర్చుకునేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నీర్పాకోట గ్రామ సర్పంచ్ ఆరణి విద్యనాథరెడ్డి,ఎంపీడీవో వెంకటరత్నమ్మ, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈవో రవీంద్రనాథ్, ఏపీఎం మునెయ్య, వ్యవసాయ అధికారి షణ్ముగం,పంచాయతీరాజ్ అధికారి నాగరాజు, పంచాయతీ సెక్రటరీ ఇందిరమ్మ, వీఆర్‌వో వెంకటేశ్వరులు, నాయకులు తులసియాదవ్, మాజీ సర్పంచ్ మార్ కొండయ్య యాదవ్, కె.ఎం.రాజా, గ్రామస్తులు, మహిళలు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసిపి పాలకవర్గమే అభివృద్ధిని అడ్డుకుంటోంది: టిడిపి నాయకులు



పుత్తూరు, నవంబరు 3 ప్రభాత వార్త : పుత్తూరు మునిసిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిని వైసిపి పాలకవర్గమే అడ్డుకుంటోందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ మునిసిపాలిటీలో అభివృద్ధి పనుల నిమిత్తం ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ రెండు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ నిధులతో 27 వార్డుల్లో అభివృద్ధి పనుల ఆమోదానికి తీర్మానం పెడితే దానిని వైసిపి పాలకవర్గం అడ్డుకుందన్నారు. అభివృద్ధి అంటే టిడిపి అని, తమ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ నిరంతరం అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తి అని పేర్కొన్నారు. మాజీ మంత్రి రోజా అభివృద్ధిని అడ్డుకుంటూ దిగజారుడు రాజకీయాలు చేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సిహెచ్.షణ్ముగరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, తడుకు సింగిల్ విండో ఛైర్మన్ కరుణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.